
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 352 | ఆదివారం 16 నవంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-




# స్థానికంపై ఫోకస్?!

- నేడు కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశం
- స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న ప్రభుత్వం
- 2024 జులై నాటికే ముగిసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీల పదవీకాలం
- 24న హైకోర్టుకు కోటాపై నివేదించనున్న ప్రభుత్వం
- డిసెంబర్‌లో స్థానిక ఎన్నికల 'షెడ్యూల్' విడుదల
- ప్రత్యేకాధికారులతో సాగుతున్న పాలన
- నేడు జరిగే కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం

### పార్టీ పరమైన రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు

### ప్రభుత్వ పరంగా బీసీలకు 42% పక్కకే!

### కాంగ్రెస్ అధిష్ఠానం ముందు రేవంత్ ప్రతిపాదన

*స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. జూబ్లీహిల్స్ ఎన్నికలో గెలుపొందిన ఉత్సాహంతో వచ్చే నెల చివరి లోపు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని యోచిస్తోంది. ఇందువల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు యథావిధిగా వస్తే గ్రామీణ పాలనా వ్యవస్థ చక్కబడుతుందని, పదవులు పరంగా కూడా భారీగా రాజకీయ ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తోంది.*

2



## ప్రపంచంలోకెల్లా భారతీయ కుటుంబ వ్యవస్థ చాలా గొప్పది



**అమరావతి**

భారత రాజ్యాంగం అందించే స్ఫూర్తి చాలా గొప్పదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అద్భుతమైన రాజ్యాంగాన్ని బీఆర్ అంబేద్కర్ మనకు రూపొందించి ఇచ్చారని ఉద్ఘాటించారు. ఓ ఛాయ్ వాలాగా ఉన్న నరేంద్రమోదీ ... దేశానికి అత్యుత్తమ ప్రధాని కాగలిగారు అంటే అది మన రాజ్యాంగం గొప్పదనమని అభివర్ణించారు. ఆదివారం గుంటూరు జిల్లాలో జరిగిన భారత రాజ్యాంగ సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. రాబోయే రోజుల్లో ప్రపంచానికి భారతదేశం అన్నిరంగాల్లో నిపుణులను అందిస్తుందని వివరించారు. 2014లో 11వ స్థానంలో ఉన్న భారతదేశం క్రమంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే నాల్గోవ లార్జెస్ట్ ఎకానమీగా భారతదేశం ఎదిగిందని నొక్కిచెప్పారు. 2047 కల్లా ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత ప్రభావవంతమైన దేశంగా భారతదేశం మారుతోందని వెల్లడించారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది ప్రజాస్వామ్యాన్ని అమలు చేయడంలో న్యాయవ్యవస్థ అత్యంత కీలక బాధ్యత వహిస్తోందని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. తొలుత ప్రింట్ మీడియా ... ఆ తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా.. ఇప్పుడు సోషల్ మీడియా వచ్చిందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ వారి అభిప్రాయాలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా కొంతమంది వ్యక్తి హననానికి పాల్పడటం దురదృష్టకరమని తెలిపారు. ప్రపంచంలోకెల్లా భారతీయ కుటుంబ వ్యవస్థ చాలా గొప్పదని ఉద్ఘాటించారు. హెల్తీ హ్యాపీ సొసైటీ స్థాపనే రాజ్యాంగం లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ప్రజల్లోకి విస్తృతంగా కమ్యూనిస్టు సిద్ధాంతం

### పార్టీ, ప్రజాసంఘాల బలవపేతమే లక్ష్యం

### పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్యవాదాన్ని కాపాడుకోవాలి

### బీజేపీ, ఆరెస్సెస్ ఆగడాలు తిప్పికొట్టాలి

### సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**అంకుశం ప్రతినిధి విజయవాడ నవంబర్ 16**

'ప్రజల్లోకి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాన్ని విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా అన్ని స్థాయిలలోను పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణాన్ని బలోపేతం చేయాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా పిలుపునిచ్చారు. బీజేపీ, ఆరెస్సెస్ శక్తులు భారత రాజ్యాంగ ప్రజాస్వామిక వ్యవస్థకు తూట్లు. పొడుస్తున్నాయని, పార్లమెంటరీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని సామాజిక న్యాయం, సమాఖ్యవాదం భావవను బలహీన పరుస్తున్నాయని దుయ్యబట్టారు. సమాఖ్య వాదం భారతదేశ పరిపాలనలో అత్యంత ప్రాథమిక సూత్రమని, కానీ మోదీ ప్రభుత్వం దానిని బలహీన పరుస్తోంద'ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. - మిగతా2లో

## సంపద సృష్టి లేక తిరోగమనంలో ఏపీ

**తాడేపల్లి**



ఏపీ ఆర్థిక పరిస్థితిపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తామంటూ టీడీపీ, జనసేన నేతలు చెప్పిన దానికి విరుద్ధంగా ఆర్థిక పరిస్థితి ఉందని జగన్ తెలిపారు. కాగ్ నివేదికలను ఉటంకిస్తూ వైఎస్ జగన్? వివరాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. తక్కువ ఆదాయ వృద్ధి, తక్కువ మూలధన పెట్టుబడి, పెరిగి పోతున్న రుణభారం అంటూ జగన్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా.. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరకరంగా మారింది. కాగ్ విడుదల చేసిన గణాంకాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సంపద సృష్టిస్తామంటూ టీడీపీ, జనసేన నేతలు చెప్పిన దానికి విరుద్ధంగా పరిస్థితి ఉంది. టీడీపీ కూటమి - మిగతా3లో

## పద్మావతి అమ్మవారి ఆలయంలో వైభవంగా లక్ష కుంకుమార్చన



**అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 16**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం లక్ష కుంకుమార్చన సేవ వైభవంగా జరిగింది. హిందూ సనాతన ధర్మంలో కుంకుమకు ఎనలేని - మిగతా2లో

# ప్రజల్లోకి విస్తృతంగా కమ్యూనిస్టు సిద్ధాంతం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వాలు అధికారాలను హరిస్తూ.. అన్నీ కేంద్రంలో కేంద్రీకరించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందని, అదే భారత్‌లో జరుగుతుందని విశ్లేషించారు. ఇలాంటి పరిస్థితిల్లో సీపీఐ చురుగ్గా వ్యవహరించాలని, బీజేపీ, ఆరెస్సెస్ ఆగడాలను తిప్పికొట్టేలా ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. విజయవాడ దాసరిభవన్‌లో ఆదివారం సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ అంశాలపైన, బీహార్‌లో ఇండియా బ్లాక్ ఓటమిపైన, రాబోయే రోజుల్లో పార్టీ కర్తవ్యం, బలోపేతం, సీపీఐ 100 సంవత్సరాల విజయోత్సవాలపై రాజా ప్రసంగించారు. ముందుగా కొత్తగా ఎన్నికైన ఏపీ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్యకు, కార్యదర్శివర్గ సభ్యులకు, జాతీయ కార్యదర్శి రామకృష్ణకు రాజా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో విద్యార్థి, యువజన సంఘాలకు నాయకత్వం వహించిన ఈశ్వరయ్య పార్టీ బలోపేతానికి శ్రమించాలని కోరారు. నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు ఎనలేని పాత్ర పోషించారని, తుపాకీ గుళ్ళకు సైతం బెదరలేదని, ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని, రక్తపాతం ఎదురైనా వెనక్కి తగ్గలేదన్నారు. ఇప్పుడు కూడా అదే కట్టుబాట్లు, అదే ధైర్యం మనకు అవసరమని అన్నారు. చండీగఢ్‌లో జరిగిన పార్టీ జాతీయ మహాసభల్లో ప్రధానంగా పార్టీ బలోపేతంపైన విస్తృతమైన చర్చ జరిగిందని గుర్తుచేశారు. ఆ దిశగా మనకు నిబద్ధత కలిగిన, సిద్ధాంతపరంగా పటిష్ఠమైన కేడర్ అవసరమని దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు, శిబిరాలు నిర్వహించడం ద్వారా పార్టీని శాఖ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింతగా బలోపేతం



చేయాలన్నారు. ప్రతి స్థాయిలోను పార్టీ నిర్మాణం బలంగాను, కేడర్ చురుకుగాను, ఉత్సాహంగాను పనిచేయాలని చెప్పారు. ప్రజల్లోకి పార్టీ సిద్ధాంతాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని, కష్టజీవులకు ఏకైక పార్టీగా ఉన్నది ఒక్క సీపీఐనే అని నొక్కిచెప్పాలన్నారు. బహుళపక్ష పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దిశగా అడుగులేయాలని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే.. కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం, ఒకటి రెండు సీట్లు గెలవడమే కాదని, అది అసలు లక్ష్యం కాదన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే...ప్రజల హృదయాలను గెలుచుకోవడం, జన విశ్వాసాన్ని సంపాదించడమని తెలిపారు. మన పార్టీ ఎన్నికల్లో పాల్గొనాలని, ప్రజల విశ్వాసం గెలుచుకోవాలని, ప్రజలు మన పార్టీని శక్తిగా భావించాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా, వారి జీవితంలో ఏ ఇబ్బంది వచ్చినా ప్రజల చూపు సీపీఐ వైపు తిరగాలని తెలిపారు. "ఇక్కడ ఎర్రజెండా ఉంది. ఇక్కడ కమ్యూనిస్టు పార్టీ ఉంది. వీళ్లు మన కోసం నిలబడతారు. మన సమస్యలు తీసుకుంటారు. ఒక్క కమ్యూనిస్టులే ప్రజల కోసం పోరాడుతారు. అవే నమ్మకం ప్రజల్లో ఉండాలని" రాజా ఉద్బోధించారు. చండీగఢ్ మహాసభల దిశానిర్దేశం ప్రకారం..దేశ హితం కోసం, ప్రజల హితం కోసం కమ్యూనిస్ట్ శక్తులు ఒకటిగా రాకపోతే, ఫాసిస్టు శక్తులపై బలమైన పోరాటాన్ని నిర్మించడం అసాధ్యమని తేల్చిచెప్పారు. ఫాశిస్టు శక్తులపై రాజీపడకుండా నిలబడగల సిద్ధాంతపరమైన బలం మనలోనే ఉందని, అదే సీపీఐ అని నొక్కిచెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అనీ రాజా మాట్లాడుతూ బీహార్ ఎన్నికల్లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలను ప్రలోభాలకు గురిచేసినట్లు తన ప్రచార పర్యటనల్లో తెలిసిందన్నారు. తాను బీహార్‌లో దాదాపు 15 రోజులు గడిపానని, గ్రామాలలో ప్రజల మధ్య తిరుగుతూ వారితో ప్రత్యక్షంగా మాట్లాడానని గుర్తుచేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో బీహార్‌లో అధిక శాతం దళిత ప్రాంతాల నుంచే, ఆదివాసీ ప్రాంతాల నుంచే, మైనారిటీ ప్రాంతాల నుంచే ప్రత్యేకంగా ముస్లిం సమాజం నుంచే ఓటర్లను తొలగించారన్నారు. ఇది బీహార్‌లో నేను స్వయంగా చూసిన వాస్తవమని, గ్రామాల్లో తిరుగుతూ ప్రజలే నాతో ఇవన్నీ పంచుకున్నారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడు, పార్టీ, ప్రజా సంఘాలు సర్వం పాల్గొనాలని సూచించారు. ఏపీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు మాట్లాడారు

ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, డేగా ప్రభాకర్, కె.రామాంజనేయులు, పి.దుర్గాభవాని, టి.మధు, పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్,మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు. సభకు విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు స్వాగతం పలికారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రానాయక్, పెంచలయ్య, కోశాధికారి ఆర్.పిచ్చియ్య తదితరులు విప్లవ గేయాలను ఆలపించారు. ఏఐవైఎఫ్ ప్రచురించిన కేరీర్ గైడెన్స్ పుస్తకాన్ని డి.రాజా ఆవిష్కరించారు.

# పెరిగిన లోకేష్ ఇమేజ్

**విజయవాడ :** బీహార్ లో ఎన్డీఏ దూసుకెళ్లింది. జేడీయుతో పాటు బిజెపి భారీ విజయం దిశగా దూసుకు వెళ్తోంది. దీంతో దేశవ్యాప్తంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సంబరాల్లో మునిగిపోయాయి. ఏపీలో సైతం సందడి నెలకొంది. సరిగ్గా విశాఖలో పెట్టుబడుల సదస్సు ప్రారంభమైన వేళ.. బీహార్లో ఎన్డీఏ విజయం చంద్రబాబుతో పాటు లోకేష్ లో ఎనలేని ఆనందం నింపింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ పెట్టుబడుల సదస్సు జరుగుతున్న సంగతి తెలిసిందే. పైగా ఈ గెలుపులో మంత్రి నారా లోకేష్ సైతం కీలక భాగస్వామి కావడం విశేషం. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రెండు రోజులు మంత్రి నారా లోకేష్ బీహార్లో పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో ఎన్డీఏ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి లోకేష్ ప్రత్యేక ఆహ్వానం అందే అవకాశముంది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలుగా టిడిపి, జనసేన ఉండడంతో సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు సైతం బిజెపి పెద్దలు ఆహ్వానించే అవకాశం ఉంది. కానీ మంత్రి నారా లోకేష్ ను ప్రత్యేక అతిథిగా భావించే ఛాన్స్ కూడా కనిపిస్తోంది.వాస్తవానికి సీఎం చంద్రబాబు బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేస్తానని ప్రకటించారు. కానీ ఇంతలో విశాఖ పెట్టుబడుల సదస్సు, ఆపై విదేశీ పర్యటనలతో ఆయన బిజీగా మారారు. బీహార్లో తెలుగు ఓటర్లు తక్కువే అయినా.. ఏపీలో నిర్మాణరంగంలో బీహార్ వాసులు ఎక్కువ. ముఖ్యంగా అమరావతి తో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో బీహార్ కార్మికులు ఎక్కువగా ఉంటారు. ఆపై రాష్ట్రంలో చాలా రంగాల్లో బీహార్ కార్మికులు పనిచేస్తుంటారు. ప్రస్తుతం ఏపీలో యూత్ ఐకాన్ గా ఉన్నారు లోకేష్. అనేక రకాలుగా తనను తాను ప్రూవ్ చేసుకొని నిలబడగలిగారు. అందుకే కేంద్ర పెద్దలు నారా లోకేష్ ను ఎన్నికల ప్రచారానికి పంపాలని చంద్రబాబును కోరినట్లు తెలుస్తోంది. వారి కోరిక మేరకు మాత్రమే బీహార్లో లోకేష్ పర్యటించారు. ఎన్డీఏ విధానాలు చెప్పడంతో పాటు ఏపీలో వన్ చాన్స్ అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి చేసిన విధ్వంసాన్ని వారికి వివరించారు. బీహార్ కు అటువంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలని సూచించారు. ఇవి అక్కడి ప్రజల్లోకి బలంగా వెళ్లినట్లు తెలుస్తోంది.ఇటీవల ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తున్న సంగతి తెలిసిందే. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖ ఏర్పాటు కానుంది. ప్రపంచ ఐటి దిగ్గజ సంస్థలు సైతం వస్తున్నాయి. దేశంలో ఇతర రాష్ట్రాలతో పోటీపడి మరి పరిశ్రమలను తెస్తున్నారు. అయితే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం జరిగిన తర్వాత జాతీయస్థాయిలో సైతం లోకేష్ పేరు మార్మోగిపోయింది. లోకేష్ ఇమేజ్ జాతీయస్థాయిలో పెరిగింది. అటు బీహార్ లో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షం నడుస్తోంది. ఈ తరుణంలో లోకేష్ ను ప్రచారంలో దింపడం



ద్వారా ఎన్డీఏకు మద్దతు పెంచవచ్చు అన్న ఆలోచనలో పడ్డారు కేంద్ర పెద్దలు. లోకేష్ కు ప్రచారానికి పిలవగా ఆయన నాలుగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ నాలుగు ప్రాంతాల్లో ఎన్డీఏ ఘనవిజయం సాధించింది. దీంతో లోకేష్ కు మరింత పేరు వచ్చింది. జాతీయస్థాయిలో బిజెపి పెద్దలు సైతం లోకేష్ కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది.

**ప్రపంచాన్ని చుట్టేసిన లోకేష్**

రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్నారు నారా లోకేష్. ఐటీ శాఖ మంత్రిగా కూడా కొనసాగుతున్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా టీజీ భరత్ వ్యవహరిస్తున్నారు. కానీ నారా లోకేష్ గత ఏడాదిన్నర కాలంగా కలవని పారిశ్రామికవేత్త లేరు. ఐటీ దిగ్గజ సంస్థల అధినేతలు లేరు. వాటి ఫలితాలు ఈ పెట్టుబడుల సదస్సులో కనిపించనున్నాయి. మంత్రి నారా లోకేష్ ఒకవైపు ప్రభుత్వ పాలన, తన శాఖ పనితీరు, టిడిపి రాజకీయ వ్యవహారాలు చూస్తూనే.. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ పారిశ్రామికవేత్తలతో భేటీకి అవకాశం ఉంటే.. అక్కడకు వెళ్లి ఏపీని ప్రమోట్ చేశారు. అమెరికాలో ఏకంగా గూగుల్ క్లౌడ్ హెడ్ తో సమావేశం కూడా అయ్యారు. ఆ సమావేశమే విశాఖ ఏఐ హబ్ గా మారేందుకు బీజం పడింది.ఒకసారి మంత్రి నారా లోకేష్ ను చూస్తే ఆయన తనను తాను మార్చుకునే తీరు ఇట్టే ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఏపీ కోసం ఆయన అదే తరహా ప్రయత్నం చేస్తున్నారు. పెట్టుబడులతో పాటు పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో సీఎం చంద్రబాబు కంటే మెరుగైన పనితీరు కనబరుస్తున్నారు. ఒకప్పుడు మైక్రోసాఫ్ట్ను హైదరాబాద్కు తీసుకురావడంలో చంద్రబాబు కృషి ఉంది. ఇప్పుడు లోకేష్ సైతం తనకంటూ అటువంటి ముద్ర కోసం ప్రయత్నాలు చేశారు. పారిశ్రామిక వర్గాలతో టచ్ లోకి వెళ్లిపోతున్నారు. అయితే ఆయన చేసిన ప్రయత్నాలు కొంతవరకు వర్కౌట్ అవుతూ వచ్చాయి. ఈరోజు పెట్టుబడులు, విశాఖకు వచ్చే దిగ్గజ పరిశ్రమలు, వారితో జరిపే చర్చల్లో లోకేష్ పనితీరు బయటపడనుంది. లోకేష్ తనను తాను మార్చుకున్న తీరు.. పాలనలో తాను వ్యవహరిస్తున్న తీరు మాత్రం ఆయన రాజకీయంగా బలపడేందుకు ఎంతగానో దోహదం చేయనుంది. ప్రతి మనిషి నిశితంగా ఆయనను గమనిస్తున్నారు. ఒకప్పుడు విమర్శించే వారు సైతం సానుకూలంగా చూస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులు సైతం అంతర్గత చర్చల్లో లోకేష్ పని తీరును మెచ్చుకుంటున్నారు. ఎందుకంటే ఆయనకు కావాల్సింది ఏముందిమంత్రి నారా లోకేష్ ఇప్పుడు బహుళ పాత్ర పోషిస్తున్నారు. రాజకీయాల్లో తనకంటూ ఒక మార్కు చాటుకున్నారు. పాలనలోనూ తనదైన పాత్రను పోషిస్తున్నారు. ఏపీ భవిష్యత్తు కోసం చాలా రకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఒక బాధ్యతాయుతమైన పాత్రతో ముందుకు సాగుతున్నారు. అసలు రాజకీయాలకి పనికిరాడు అని ముద్రవేశారు. చంద్రబాబుకు తగిన తనయుడు కాదని నిర్ధారించేశారు. కానీ ఆ చిక్కుముళ్లను, అవమానాలను తట్టుకుని నిలబడ్డారు నారా లోకేష్. ఒక్క మాటలో చెప్పాలంటే విశాఖ పెట్టుబడుల సదస్సు ఒంటి చేత్తో నడిపించే శక్తిగా మారారు లోకేష్. తప్పకుండా విశాఖ సదస్సు గేమ్ చేంజర్ గా నిలిచే అవకాశం ఉంది

## చంద్రబాబుకు గుడివాడ అమర్నాథ్ కౌంటర్

సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కౌంటర్ ఇచ్చారు. గతంలో మూడు సార్లు ఇలానే సీఐఐ సదస్సులు నిర్వహించారు. 2014-19 మధ్యలో లక్షకోట్లు పెట్టుబడులు వస్తాయని నమ్మించారు. మొత్తం మీద 35వేలకోట్లు మాత్రమే రూపాంతరం చెందాయి. వచ్చాయి. లక్షల ఉద్యోగాలు వస్తాయని యువతకి లేని పోని ఆశలు పెట్టి నమ్మించి మోసం చేశారు. మా ప్రభుత్వంలో సదస్సు నిర్వహించాం. కానీ పారదర్శంగా ఎంవోయూలు కుదుర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ సీఐఐ సదస్సులో కొత్తగా ఏం తీసుకొచ్చారో క్లారిటీ ఇవ్వలేకపోయారని ధ్వజమెత్తారు.



## పద్మావతి అమ్మవారి ఆలయంలో వైభవంగా లక్ష కుంకుమార్చన

-మొదటిపేజీ తరువాయి

ప్రాధాన్యత ఉంది. వివాహితురాలైన మహిళ నుదుట కుంకుమ ధరించడం వల్ల భర్త దీర్ఘాయుష్షు పొందుతాడని హిందూ ధర్మం చెబుతోంది. లక్ష్మీ, సరస్వతి, పార్వతి అమ్మవార్ల పేర్లతో పిలుస్తున్న శక్తి అమ్మవారికి ప్రతిరూపంగా సింధూరం లేదా కుంకుమకు ప్రాశస్త్యం ఉంది. అమ్మవారి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు లాంటి భారీ ఉత్సవాలను నిర్వహించే ముందు అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించడం సంప్రదాయం. ఈ విశిష్టమైన సేవ ద్వారా అమ్మవారు ప్రసన్నమై ఉత్సవాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా ఆశీర్వదిస్తారని అర్చకులు తెలిపారు. ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారిని ఆశీనులను చేసి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు లక్ష్మీ అష్టోత్తరం, లక్ష్మీ సహస్రనామాలను వల్లిస్తూ అమ్మవారిని కుంకుమతో అర్చన చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఈ సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, పాంచరాత్ర ఆగమసలహాదారు మణికంఠ భట్టర్, అర్చకులు బాబుస్వామి, పలువురు అర్చకులు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## సంపద సృష్టి లేక తిరోగమనంలో ఏపీ

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ పనితీరును గమనిస్తే వారి వైఫల్యాలు స్పష్టంగా కనపడతాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి కేవలం 7.03% మాత్రమే ఉంది. 2025-26లోనైనా రాష్ట్రం ఆర్థికంగా కోలుకుంటుందని చాలామంది ఆశించారు. కానీ, కాగ్ విడుదల చేసిన గణాంకాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. సొంత ఆదాయాలు ఏమాత్రం పెరగకపోగా, మూలధన పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గిపోతుంది. అయినప్పటికీ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందంటూ ఎలా ప్రచారం చేస్తారు?. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డీపీ వృద్ధిని 12.02%గా ప్రభుత్వం ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆ వృద్ధిని 17.1%గా లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఫలితాలు దారుణంగా ఉన్నట్లు కాగ్ నివేదికలే తేల్చి చెప్తున్నాయి. సంపద సృష్టి లేకపోవటంతో రాష్ట్రం తిరోగమనంలో ఉంది. కానీ, అభివృద్ధిలో వేగంగా పరుగులెత్తుతోందంటూ ఎలా మాట్లాడతున్నారు?' అని ప్రశ్నించారు.

## కీలక మలుపులు తిరుగుతున్న పరకామణికేసు

**తిరుమల :** తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక ఫిర్యాదుదారు సతీష్ కుమార్ అనుమానాస్పదంగా చనిపోయారు. ఆయన మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్ఓ). ఈ ఘటన నవంబర్ 13, 2025న జరిగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం వద్ద రైల్వే ట్రాక్ మీద ఆయన మృతదేహం దొరికింది. సతీష్ కుమార్ వయసు 45 సంవత్సరాలు. తిరుపతి సమీపంలో నివసించేవారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు మృతదేహాన్ని చూశారు. రైలు ఢీకొని చనిపోయినట్లు కనిపించినా, శరీరంపై గాయాలు అసహజంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. తాడిపత్రి పోలీసులు అనుమానాస్పద మరణం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. కుటుంబ సభ్యులు ఆత్మహత్య కాదని, హత్యే అని చెబుతున్నారు. పరకామణి చోరీ కేసు 2023 ఏప్రిల్‌లో మొదలైంది. భక్తులు సమర్పించిన బంగారు, నగలు, విదేశీడాలర్లను రవికుమార్ అనే పెద్దజీయర్ మఠం ఉద్యోగి దొంగిలిస్తూండగా పట్టుకున్నారు. ఆయనపై సతీష్ కుమార్ మొదటి ఫిర్యాదు చేశారు. పెద్ద జీయర్ మఠం గుమస్తా రవి కుమార్ 920 అమెరికన్ డాలర్లు దొంగిలిస్తూ దొరికిపోయారని కేసు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత ఆయన రవికుమార్ తో లోక్ అదాలత్ లో రాజీ చేసుకున్నారు. దొంగతో రాజీ చేసుకోవడం ఏమిటన్న విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 2025 అక్టోబర్‌లో హైకోర్టు ఆదేశంతో సీఐడీ దర్యాప్తు మొదలైంది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో బృందం విచారణ ప్రారంభించారు. రవికుమార్ ఆస్తులను కొన్ని టీటీడీ పేరన రిజిస్టర్ చేసి..మిగతా పెద్ద మొత్తంలో ఆస్తులను ఇతర వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ అధికారులు స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. సతీష్ కుమార్‌ను నవంబర్ 6న తిరుపతి పద్మావతి అతిథి గృహంలో విచారించారు. మరోసారి హాజరు కావాలని నోటీసు ఇచ్చారు. ఆ తర్వాతే ఆయన చనిపోయారు. దీంతో హత్య అనుమానం పెరిగింది. సతీష్ మొబైల్, వాహనం ఇతర విషయాలను సీఐడీ అధికారులు పరిశీలిస్తున్నారు.సతీష్ కుమార్ ను ఎవరైనా హత్య చేశారా.. పరకామణి కేసులో ఆయన ఎవరి ఒత్తిడితో రాజీ చేసుకున్నారు.. రవికుమార్ ఆస్తులను ఎవరెవరు రాయించుకున్నారన్నది ఆయనకు తెలిసే అవకాశం ఉంది. ఒత్తిడి చేసిన పెద్దలే.. అసలు నిందితులు అవుతారు. ఆ విషయాలన్నీ? సతీష్ కుమార్ బయట పెడితే.. కేసు చిక్కుముడి వీడిపోతుంది. ఇలాంటి సమయంలో ఆయన అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనంగా మారింది

## స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం ఫోకస్?!

**హైదరాబాద్ :** ప్రభుత్వ పరంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లను పక్కనపెట్టి పార్టీ పరమైన రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. 50 శాతం మించి రిజర్వేషన్ల అమలుకు కోర్టు అంగీకరించక పోవటంతో పాత పద్ధతి ప్రకారమే ముందుకెళ్లాలని అనుకుం టున్నట్టు తెలిసింది. 57వసారి శనివారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ పరమైన రిజర్వేషన్ల ప్రతిపాదనను కాంగ్రెస్ అధిష్ఠానం ముందు పెట్టగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమా చారం. ఇందుకు అనుగుణంగా డిసెంబర్ తొలివారంలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7తో రెండేండ్లు పూర్తికానున్నాయి. ఈ రెండేండ్లలో తాము చేసిన పనులను ప్రజల ముందు పెట్టడానికి వేడుక నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఈలోపే స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైతే ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. కాబట్టి వేడుకలకు వీలుపడదని భావించి షెడ్యూల్ జారీని డిసెంబర్ రెండోవారానికి వాయిదా వేసినట్టు తెలిసింది. వేడుక పూర్తయిన రోజు, లేదా మరుసటి రోజు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు సమయత్తం కావాలని ప్రభుత్వ పెద్దలు అధికారులకు సూచించినట్టు సమాచారం.

**గ్రామాల్లో కుంటుపడిన పాలన**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. గ్రామీణ పాలన అస్తవ్యస్తంగా మారుతోంది. 2024 జులై నాటికి స్థానిక సంస్థల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రత్యేక అధికారుల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో పాలన కొనసాగుతోంది. దీంతో కేంద్రం నుంచి ఏడాదికి రూ.1,500 కోట్లకుపైగా రావాల్సిన నిధులు ఆగిపోయాయి. దీంతో అక్కడ పాలన వ్యవస్థ కుంటుపడింది.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అధికారికంగా కల్పించి ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఆ దిశలో ముందుకు వెళ్తున్నాయి. అయితే రిజర్వేషన్ల అమలు కోసం పక్కా ప్రణాళికతో వెళ్లుతున్న ప్రభుత్వానికి అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు వీలుగా అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకొచ్చినా ఆర్డినెన్స్ తెచ్చినా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మోకాలు అడ్డుతూ వస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

**డిసెంబర్ చివరిలోపు ఎన్నికలు**

రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 565 మండల పరిషత్తు అధ్యక్షులు, 565 జిల్లా పరిషత్తులు, 5,749 ఎంపీటీసీలు, 12,733 పంచాయతీలు, లక్షా 12 వేల 288 వార్డు సభ్యులకు జరగాల్సిన ఎన్నికలు అర్ధాంతరంగా ఆగాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సానుకూల వాతావరణం ఏర్పడింది. ఇది కాంగ్రెస్‌కు లాభం చేకూరుస్తుందని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల చివర లోపల స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# హిందూపురం శివారులో అనంత, పెద్దారెడ్డి అరెస్ట్





- వైసీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు
- నిరసనగా రోడ్డుపైనే బైఠాయించిన నాయకులు
- చివరకు అరెస్ట్ చేసి అనంతపురం తరలించిన పోలీసులు
- బాలకృష్ణ పద్ధతి మార్చుకోవాలి లేకపోతే మూల్యం చెల్లించుకుంటారు
- రాష్ట్రంలో కూటమి పాలనలో దౌర్జన్యకాండ
- అనంత వెంకట్రామిరెడ్డి ఆవేదన

**అంకుశం న్యూస్‌అనంతపురం/హిందూపురం, నవంబర్ 16 :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురంలో ఆ పార్టీని గెలిపిస్తున్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బాలకృష్ణ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని.. ఎన్నికలకు ముందు కుటుంబ సభ్యులతో రావడం, ఆ తర్వాత సినిమాలకు పరిమితం కావడం పరిపాటిగా మారిందన్నారు. హిందూపురం నియోజకవర్గానికి బాలకృష్ణ గెస్ట్ ఆర్టిస్ట్ అని వ్యాఖ్యానించారు. శనివారం హిందూపురంలో వైసీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి అనంతపురం నుంచి హిందూపురానికి బయలుదేరిన అనంత వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహం వద్దే టూటౌన్ సీఐ శ్రీకాంత్, పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై మండిపడ్డ అనంత.. చివరకు హిందూపురం వెళ్లారు.

**హిందూపురం శివారులో అడ్డుకున్న పోలీసులు**

హిందూపురం పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీ వద్దకు చేరుకోగానే అనంతతో పాటు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, వైసీపీ అనంతపురం నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, యువజన విభాగం అనంతపురం నగర అధ్యక్షుడు శ్రీనివాస్ దత్త, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, ఇతర నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోకి అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. ఆ క్రమంలో పోలీసులకు, అనంతకు మధ్య వాగ్వాదం జరిగింది. పార్టీ కార్యాలయంపై టీడీపీ మూకలు దాడి చేస్తే పరిశీలించేందుకు రాకూడదంటే ఎలా? అని సూటిగా ప్రశ్నించారు. తాము అల్లర్లు చేయడానికి వెళ్లడం లేదని, పార్టీ శ్రేణులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. తమను అడ్డుకోవడం తగదంటూ రోడ్డుపైనే వైసీపీ నాయకులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు పోలీసులు వారిని వాహనాల్లో అనంతపురం తరలించారు. అనంతపురంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు అనంతతో పాటు ఇతర నాయకులను తీసుకొస్తున్నారన్న సమాచారం అందుకున్న వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున కోర్టు రోడ్డుకు చేరుకున్నారు. పోలీస్ వాహనం రాగానే రోడ్డు మీద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు అనంతను ఆయన స్వగృహానికి చేర్చి మళ్లీ బయటకు వెళ్లకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు. కూటమి పాలనలో రావణకాష్టం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హిందూపురంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై టీడీపీ గూండాలు, అల్లరి మూకలు దాడి చేసి సిబ్బంది, కార్యకర్తలను గాయపర్చారన్నారు. దాడిలో గాయపడ్డ వారితో పాటు పార్టీ శ్రేణులతో మాట్లాడేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ఎక్కడికక్కడ కీలక నాయకులను గృహ నిర్బంధం చేయడం ఏంటని ప్రశ్నించారు. తాము అల్లర్లు చేయడానికో, రెచ్చగొట్టడానికో వెళ్లలేదని స్పష్టం చేశారు. తమపై పోలీసులు జులుం ప్రదర్శించి అరెస్ట్ చేశారన్నారు. పోలీసులున్నది టీడీపీ నాయకులకు తొత్తుగా ఉండాలని కాదన్నారు. టీడీపీ గూండాలు ఏం చేసినా పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ వ్యవస్థను టీడీపీకి ఊడిగం చేయడానికి ఏర్పాటు చేయలేదన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. పోలీసులు తమ ప్రతిష్టను వాళ్లే దిగజార్చుకుంటున్నారని మండిపడ్డారు. అధికారం ఉందనో..పశుబలం ఉందనో తమ గొంతు నొక్కాలంటే అది ఎవరి తరం కాదని టీడీపీ నాయకులను హెచ్చరించారు. ఈ రోజు వాళ్లు నాటుతున్న విత్తనమే మహావృక్షమవుతుందన్నారు. మీ వికృత చేష్టలు, అధికార దురహంకారానికి ఎవరూ తలొగ్గమని స్పష్టం చేశారు. పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగం కాకుండా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.

**ప్రజల పక్షాన ఉంటాం..ఎవరికీ భయపడం..!**

హిందూపురంలో పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు అరాచకం చేస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. హిందూపురం పట్టణానికి తాగునీటి సమస్య తీర్చిన ఘనత కూడా వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందని గుర్తు చేశారు. గతంలో బాలకృష్ణ పీఏలుగా ఉన్న శేఖర్, బాలాజీలు హిందూపురంలో ఏం చేశారో అక్కడి ప్రజలకు తెలుసన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని, ఎవరికీ భయపడేది లేదని తెలిపారు.

# బిరసా ముండా జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్

## - చిరస్మరణీయుడు భగవాన్ బిరసా ముండా ఎంపీ కేశినేని

**అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 16:-** గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించటం చాలా ఆనందంగా వుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. బిర్సా ముండా 150 జయంతిని పురస్కరించుకుని తెలుగులో ముద్రించిన డాక్టర్ మోహన్ భాగవత్ రాసిన భగవాన్ బిరసా ముండా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, నేషనల్ కమీషన్ మాజీ మెంబర్ మాదిగాని గురునాథం బిర్సా ముండా చిత్ర పటాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ కు బహుకరించారు.



ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా చిరస్మరణీయుడన్నారు. బ్రిటీష్ వారిపై బిర్సాముండా చేసిన పోరాటాలు గిరిజనుల్లో చైతన్యం నింపి ఆదివాసులకు ఆరాధ్య దైవంగా మారాడన్నారు. బిర్సా ముండా గిరిజనుల హక్కుల కోసం, గిరిజన జాతుల ఆచారాలు, సాంఘిక విలువలకు గౌరవం తీసుకురావటం కోసం పోరాడారని తెలిపారు. బిర్సా ముండా పోరాటము సత్యం, న్యాయం, లక్ష్యాలుగా సాగిందన్నారు. జనజాతీయ గౌరవ దివస్ వల్ల బిర్సా ముండా లాంటి ఎంతో మంది గిరిజన వీరుల గాథలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ప్రాచుర్యంలో లేని గిరిజన చరిత్రకు ప్రాధాన్యత లభించిందన్నారు

ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వి. నరసింహా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా పాల్గొన్నారు.

## శ్రీవారి మెట్టు వద్ద ఘనంగా కార్తీక వనభోజనం



**అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 16:** పవిత్ర కార్తీకమాసం సందర్భంగా ఆదివారం శ్రీవారి మెట్టు వద్ద గల పార్వేట



మండపంలో కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవరులను ఊరేగింపుగా పార్వేటిమండపానికి తీసుకొచ్చారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం పార్వేట మండపంలో మధ్యాహ్నం 12 నుండి 2 గంటల వరకు కార్తీక వనభోజనోత్సవం జరిగింది.

అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో శ్రీమతి పి.వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ లు రాజ్ కుమార్, రమేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ లు ధనశేఖర్, ముని కుమార్, అర్చకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# అనంతలో 17న కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## - : జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
## - : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అంకుశం న్యూస్ అనంతపురం, నవంబర్ 16 :** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో 17వ తారీఖున అనంతపురం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 17వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ :

ఈనెల 17వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాజీ మంత్రి, శ్రీకాకుళం జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే సత్తి




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 16:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, శ్రీకాకుళం జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, వారి కుమారుడు, నరసన్నపేట నియోజకవర్గం పోలాకి జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య స్వామి మాల ఇరుముడు సమర్పణ సందర్భంగా శనివారం నాడు ఆంధ్ర శబరిమలగా ప్రసిద్ధి చెందిన ద్వారపూడి అయ్యప్ప స్వామి గుడికి విచ్చేశారు. వారిని గుడి వద్ద అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వీరితో పాటు ర్యాలీ కృష్ణ, వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి(బుజ్జి), కోణాల సత్యనారాయణ రెడ్డి తదితర వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానంలో మాల ధారణ స్వాములకు దారపనేని అన్న ప్రసాద వితరణ

**కనిగిరి నవంబర్ 16 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, శ్రీమతి పద్మ , తేజ



కృష్ణ, చైతన్య కృష్ణ కుటుంబ సభ్యులు, మరియు దారపనేని తోడల్లుడు యేలూరి విజయ్ చంద్రబాబు, శ్రీమతి సావిత్రి, కుమార్తె వెంకటకీర్తి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో అయ్యప్ప స్వాములకు, శివ స్వాములకు, వెంకటేశ్వర స్వాములకు, ఆంజనేయ స్వాములకు దేవస్థానం గౌరవ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి తో కలిసి దారపనేని అన్న ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిమట పట్టాభి స్వామి, గోరుగంతుల సిద్దు స్వామి వేదమంత్రాలతో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దారపనేని చంద్రశేఖర్ కు స్వామివారి పూలమాల, చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్లు గుత్తి వెంకటరాజు, కావిటి వెంకటసుబ్బయ్య, మాట్లాడుతూ శాశ్వత అన్నదాన కార్యక్రమానికి దాతల సహకారానికి దారపనేని చంద్రశేఖర్ ఎనలేని కృషిచేసి ప్రతి సంవత్సరము 60 రోజులు అన్నదానం చేయుటకు తోడ్పాటును దారపనేని అందించారని, ఆ కృత నిశ్చయంతో మాల ధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ దారపనేని సుబ్బారావు, తిరి వీధి హాజరత్, ఓగూరి నరసింహారావు, కంబాల రోశయ్య స్వామి, వాయునేని వైట్ మాల్యాద్రి స్వామి, యడవల్లి వెంకటరెడ్డి, జాజం హరికృష్ణ మాల ధారణ స్వాములు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నున్న కల్లుగీత కార్మిక సంఘం మాజీ నేత ఆంజనేయులు మృతి



**అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 16 :**విజయవాడ రూరల్ మండలం నున్న కల్లుగీత కార్మిక సహకార పరపతి సంఘం మాజీ కార్యదర్శి ఆరేపల్లి ఆంజనేయులు (65) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. నాలుగు రోజుల క్రితం ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో విజయవాడ నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు ఆయనకు చికిత్స చేస్తుండగా, శనివారం అర్థరాత్రి తర్వాత ఆయనకు గుండెపోటు వచ్చింది. దీంతో వైద్యులు ఆయనను ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి చికిత్స చేస్తుండగా, ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం, ప్రభుత్వం నుంచి పింఛన్ సౌకర్యం కోసం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వహించిన అనేక పోరాటాలలోఆంజనేయులు చురుకుగా పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మచిలీపట్నం, ఖమ్మం, హైదరాబాద్‌లో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం మహాసభలు, పోరాటాలలో ఆంజనేయులు పాల్గొన్నారు. గీత కార్మిక సంఘం పోరాట ఫలితంగానే గీత కార్మికులు గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి పింఛన్ పొందుతున్నారు. ఆంజనేయులు మృతి వార్త తెలియడంతోనే పలు గ్రామాలకు చెందిన కల్లుగీత కార్మిక సంఘం నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తులు ఉన్నారు. కుమార్తెలు ఇరువురికి వివాహాలు చేశారు.

## నల్లల మునిశేషిరెడ్డి మృతికి - మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి నివాళి

**అంకుశం న్యూస్ నంద్యాల నవంబర్ 16:** నంద్యాల జిల్లా పాణ్యం మండలం కౌలూరు గ్రామానికి చెందిన బైరెడ్డి వర్గం, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ తాలూకా అధ్యక్షులు, నల్లల మునిశేషి రెడ్డి( 96) ఆదివారం వయోభారంతో మృతి చెందారు. మునిశేషిరెడ్డి మరణవార్త



తెలిసిన వెంటనే టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కౌలూరు గ్రామంకు చేరుకొని మునిశేషిరెడ్డి పార్థివ దేహానికి ఘనంగా నివాళ్లు అర్పించిన, ఆయన కుటుంబ సభ్యులను బైరెడ్డి రాజశేఖరరెడ్డి పరమార్శించి సంతాపం తెలిపి, సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మొదటి తరం రాజకీయ నాయకులుగా, విలువలతో కూడిన రాజకీయాలు చేసి, ఆనాటి తాలూకా అధ్యక్షులుగా మునిశేషిరెడ్డి పనిచేశారని ఆయన సేవలు కొనియాడారు.

# సేవా స్పూర్తి కలయిక
# కార్తీక మాసం వన సమారాధనలు

**- తిరువూరులో ఆర్యవైశ్య సంఘం వనసమారాధనలో ఎంపీ కేశినేని శివనాథ్**





**అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 16:** కార్తీక మాసంలో ఏర్పాటు చేసే వనసమారాధనలు ఆధ్యాత్మికత సేవా స్పూర్తి కలయిక అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తిరువూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని బొడ్డు శ్రీను మామిడి తోటలో ఆదివారం ఏర్పాటు చేసిన వనసమారాధన కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్, నియోజకవర్గ అబ్జర్వర్ సుఖవాసి శ్రీనివాసరావు లకు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ సంఘం నాయకులు సన్మానించారు.


ఈ సందర్భంగా 8వ వార్డ్ కౌన్సిలర్ నాళ్ల సురేంద్ర కుమార్తె రచించిన ది గర్ల బిటివిన్ లైన్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన గుడిమెట్ల రామును అభినందించారు. అలాగే ఈ ఇరువుర్ని ఎంపీ కేశినేని శివనాథ్ ఘనంగా సత్కరించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధనలో పాల్గొనటం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డ్ కౌన్సిలర్ నాళ్ల సురేంద్ర, లతో పాటు ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ సత్య సాయి బాబా జయంతి
# ఉత్సవాలను విజయవంతం చేయాలి..

**- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నాం**

**- జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్**





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, నవంబర్ 16:** ఈనెల 19 నుండి 23 వరకు పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా జరిగే కార్యక్రమాలను ప్రజలు భక్తాదులు మరియు పాత్రికేయ సోదరులు తమ వంతు సహకారాలు అందించి వేడుకలను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ కోరారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో మీడియా ప్రతినిధులతో పాత్రికేయ సమావేశం నిర్వహించి పలు విషయాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పుట్టపర్తిలో శ్రీ సత్య సాయిబాబా శతజయంతి వేడుకలు ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో భక్తజనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో పాటు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మరియు పోలీసు యంత్రాంగం ద్వారా సమన్వయ సహకారాలతో ప్రభుత్వపరమైన పనులను పూర్తి చేయడం జరుగుతున్నట్లు తెలిపారు. దేశ విదేశాల నుండి వచ్చే భక్తాదులకు అన్ని సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందస్తు చర్యలను తీసుకొని ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెప్పారు. జయంతి వేడుకల నిర్వహణలో భాగంగా ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 19న గౌరవ దేశ ప్రధాని నరేంద్ర మోది రానున్నారని, అలాగే భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హర్యానా మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తదితర ప్రముఖులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ సూత్రప్రాయంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బాబా జన్మదిన వేడుకల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన మంత్రుల బృందం మరియు జిల్లా మంత్రులు ఎమ్మెల్సీ ఎంపీ ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధుల సూచనలు సలహాలను పాటిస్తూ పనులను వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ శాఖల ద్వారా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని... ముఖ్యంగా త్రాగునీరు, విద్యుత్తు, పారిశుధ్య పనులు, భద్రత ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, ట్రాఫిక్ మళ్లింపులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించి టీంలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తాను కూడా క్షేత్రస్థాయిలో లోటుపాట్లను గుర్తించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చర్యలు తీసుకొని పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ -**

సాయి ఆరామంలో వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే టోల్ ఫ్రీ నంబర్ 18002335598 ద్వారా ఏవైనా ఇబ్బందులు తగిన సమాచారం తెలుసుకొనే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శ్రీ సత్య సాయి విమానాశ్రయంలో ప్రస్తుతం 2 హెలిప్యాడ్లను ఏర్పాటు చేశామని మరో రెండు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని బాబా శత జయంతోత్సవాల సందర్భంగా సమాచారం అందించేందుకోసం క్యూ ఆర్ కోడ్ తో కూడిన "SAI 100 యాప్" ఏర్పాటు చేశామని ప్రజలు, భక్తుల "యాప్"ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# వనసమారాధనలు ఐక్యతకు చిహ్నాలు

**నగరాల వనసమారాధన లో ఎంపీ కేశినేని శివనాథ్**




**అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 16:** విజయవాడ నగరంలో కార్తీక మాసంలో చేసే పూజ కార్యక్రమాలు వల్ల ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. ప్రజలందరూ ఒక చోట కలిసి భోజనం చేయటం ఐక్యతకు చిహ్నమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం ఆధ్వర్యంలో జక్కండపూడి పాములకాలవ దగ్గర నగరవనం అటవీ శాఖ పార్క్ ప్రాంగణంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం నాయకులు ఎంపీ కేశినేని శివనాథ్ కు ఘన స్వాగతం పలికారు. అలాగే ఎంపీ కేశినేని శివనాథ్ ను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చిన్నారుల నృత్య ప్రదర్శనను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీకేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరాల వనసమారాధనలో పాల్గొనటం ఎంతో ఆనందంగా వుందన్నారు. నగరాల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయిన బెనర్జీ, ప్రధాన కార్యదర్శి వి.శ్రవణ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం అధ్యక్షుడు గూడెల మణికంఠ, సంఘం నాయకులు రాయన అరుణ్ కుమార్, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం బోర్డ్ మెంబర్ సుఖాసి సరిత, ఏపీ నగరాల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లు సుఖాసి కిరణ్, బేవర సాయి సుధాకర్, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, చిట్టినగర్ దేవస్థానం సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ నగరాల యువజన సంఘం సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాగ్ ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలి

**- రాయలసీమ సాగునీటి సాధన సమితి డిమాండ్**



**అంకుశం న్యూస్ కర్నూల్ నవంబర్ 16:** శ్రీ బాగ్ ఒడంబడిక ప్రకారం కృష్ణా, తుంగభద్ర నదీ జలాల పంపిణీలో రాయలసీమకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై. యన్. రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 88 సంవత్సరాలు గడిచినా ఒప్పందంలోని కీలక నిబంధనలు అమలు కానందున రాయలసీమ అభివృద్ధి తీవ్రంగా నెమ్మదించిందని ఆయన పేర్కొన్నారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో "రాయలసీమ హక్కుల దినోత్సవం"గా 1937 నవంబర్ 16 శ్రీ బాగ్ ఒప్పంద దినం పురస్కరించుకుని నంద్యాల సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వై.యన్. రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి 1953లో ఏర్పడిన ప్రత్యేక ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలులో రాజధాని, గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ 1956లో తెలంగాణ విలీనంతో రాజధాని హైదరాబాద్‌కు తరలిపోయి రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టం - 21014 అనంతరం రాయలసీమకు చట్టబద్ధ నీటి కేటాయింపులు కల్పించినప్పటికీ.. తదనంతరం ఏర్పడ్డ ప్రభుత్వాలు సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా రాజధాని లేదా హైకోర్టు రాయలసీమలో ఏర్పాటు చేయాలని సమాజం గళమెత్తినా ఏ ప్రభుత్వం కూడా ప్రజల ఆకాంక్షలను గౌరవించలేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏర్వ రామచంద్ర రెడ్డి, ఆకుమల్ల రహీం, మహేశ్వర్ రెడ్డి, మెహబూబాష, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, భాస్కర్ రెడ్డి, రాఘవేంద్ర, మనోజ్ కుమార్ రెడ్డి, న్యాయవాది అసదుల్లా, కొమ్మా శ్రీహరి, గాయకుడు గౌడ్, శంకర్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాల ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలి..

**- ధర్మవరం లో రౌండ్ టేబుల్ సమావేశం!**




**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 16:** ప్రభుత్వ వైద్య కళాశాల ను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, ప్రముఖ న్యాయవాదులు జూకూరు సుమలత, కె. ఎమ్.అతావుల్లా, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తుంపర్తి పరమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న ,తదితర నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్జీవో హెూం లో రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులతో పాటు సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎస్హెచ్ భాష, చేనేత కార్మిక సంఘం నాయకులు ఖాదర్బాషా, సన్నప్పయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి పోతులయ్య, ఎం ఎస్ యు ఐ రావుల చెరువు సురేష్ ,ఏపీ ఎస్ ఎఫ్ బండి శివ, సిఐటియు నాయకులు ఆదినారాయణ, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శ్రావణి, షబ్బీర్, నరేష్, సాకే హరీష్, మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షులుగా డాక్టర్ ఆదిశేషు నిర్వహించారు. అనంతరం ప్రముఖులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతి ద్వారా వైద్య విద్యని పూర్తిగా ప్రైవేట్ శక్తులకు ఇవ్వాలిఅన్న నిర్ణయం మంచిది కాదన్నారు పెనుకొండ పట్టణంలో ఉన్నటువంటి ప్రభుత్వ వైద్య కళాశాలను కూడా 2023 లో గత ప్రభుత్వం ప్రారంభించి, సుమారు 30 కోట్ల వరకు ఖర్చు పెట్టింది అని, ఇంత ఖర్చు పెట్టి ప్రైవేట్ వారికి ఇవ్వాలసిన అవసరం ఏముంది? తక్షణమే కూటమి ప్రభుతం, ప్రైవేటికరణను విరమించు కోవాలి అని తెలిపారు.ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీల అవసరం చాలా వుంది అని, 500కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసి, వెనుక బడిన ప్రాంతం, కొత్త జిల్లా, పెనుకొండలో సత్వరం మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభించాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ప్రభుత్వ మెడికల్ కాలేజ్లలో ఫీజులు వుండవు, ప్రభుత్వం బాధ్యత వహించి వైద్య సేవలు అందిస్తుంది అని అన్నారు. ఇక్కడ మెడికల్ కాలేజీ వస్తే సూపర్ స్పెషల్టీస్ గుండె, మూత్రపిండం, మెదడుకు, నాడి వ్యవస్థకు సంభదించిన బ్రాంచెస్ వస్తాయి అని, పేద మధ్య తరగతి వారికి ఉపయోగకరంగా ఉంటుంది అని తెలిపారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీ వస్తే ఫీజుల భారం పడుతుంది అని, ఆరోగ్యం అత్యంత ఖరీదై పోతుంది అని, పి పి పి పరం చేయడం అంటే ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయడమేనని, ప్రభుత్వం భాధ్యతల నుండి తప్పు కోవడం దుర్మార్గం అని తెలిపారు. కార్పొరేట్ లకు వేలకోట్లు అప్పులు మాఫీ చేస్తారు కానీ, మెడికల్ కాలేజీ ల నిర్మాణానికి 3వేల కోట్లు ఖర్చు చేయకపోవడం దివాలా కోరుతనంకు నిదర్శనం అన్నారు. అదేవిధంగా పి పి పి మోడల్ సక్సెస్ కాలేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా క్లిష్ట సమయాల్లో లో ఆదుకున్నది ప్రభుత్వ వైద్యమే అని, ప్రైవేట్ పరం చేస్తే పేదలకు, మధ్య తరగతికి విద్య, వైద్యం దూరం అవుతాయి అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను పిత్రీ విధానం చేయకుండా ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మొత్తం మీద రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం పట్ల అందరూ హర్షం వ్యక్తం చేశారు.

# జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 16:** జాతీయ సాయి జూడో పోటీలకు మండల పరిధిలోని చిగిచెర్ల విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల హెడ్మాస్టర్ తిమ్మారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రతాపరెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల విజయవాడ లోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం లో జరిగిన సబ్ జూనియర్ జూడో పోటీలలో చిగిచెర్ల పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభతో విజయం సాధించి జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఇందులో బాలుర కేటగిరి -45 కేజీ ల విభాగంలో ఎం. విక్రాంత్,50 కేజీ ల విభాగంలో అఫ్జల్ మెహరాజ్, బాలికల విభాగంలో - 28 కేజీ ల కేటగిరీలో కె. సంజన ఎంపిక కావడం జరిగిందన్నారు. వీరు ఈనెల 17 వ తేదీ నుంచి 20 వతేదీ వరకు హైదరాబాద్ లో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీలలో పాల్గొంటారు అని తెలిపారు. అనంతరం హెడ్మాస్టరు, ఫిజికల్ డైరెక్టర్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ, గ్రామ ప్రజలు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.